సాక్షి
ఏలూరు
గురువారం । 6 । ఫిబ్రవరి । 2025



రేషన్ బియ్యం సీజ్

నూజివీడు మండలంలోని మిట్టగూడెం వద్ద మంగళవారం అర్ధరాత్రి మినీ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 3.5 టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. 8లో ▸



పాపం పసిప్రాణం

రెండేళ్ల బాలుడిని ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొనడంతో మృతి చెందాడు. పెదపాడు మండలంలోని పాతముప్పర్రులో ఈ ఘటన చోటుచేసుకుంది. 8లో ▸



గండ్ల గుదిబండ

గతేడాది ఆగస్టు 31న కురిసిన భారీ వర్షాలకు నూజివీడులోని పెద్ద చెరువుకు గండ్లు పడి రోడ్లు సైతం ధ్వంసమయ్యాయి. ఇంత వరకు ఆ గండ్లు పూడ్చలేదు. 8లో ▸

దెందులూరులో పచ్చ దందా

- అనుమతులు లేకుండా అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలు
- మూడెకరాల్లో 2 వేలకుపైగా లారీల్లో గ్రావెల్ తరలింపు
- తవ్వకాలు అడ్డుకున్న పొలం యజమానిపై దాడి, దౌర్జన్యం
- ఫిర్యాదు చేసినా స్పందించని దెందులూరు ఎస్సై
- భూయజమాని ఫిర్యాదులు పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం
- పొలంలోకి వస్తే అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరింపులు



దెందులూరు మండలం చల్లచింతలపూడిలో అక్రమంగా తవ్వేస్తున్న గ్రావెల్



పోలీసుల సమక్షంలోనే గ్రావెల్ తవ్వకాలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గంలో గ్రావెల్ దందా తారాస్థాయికి చేరింది. నిన్నమొన్నటి వరకు పోలవరం గట్లు అసైన్డ్ భూముల్లో గ్రావెల్ దందా సాగించిన మాఫియా లీజు పేరుతో ప్రైవేటు పొలాలపై పడగ విప్పారు. అన్ని అనుమతులు తీసుకుని సక్రమంగా గ్రావెల్ తవ్వుకుంటామని భూ యజమానికి నమ్మకంగా చెప్పి లీజు అగ్రిమెంట్ చేసుకుని ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా సాగిస్తున్నారు. అడ్డుకోవడానికి యత్నించిన పొలం యజమానిపై దాడి చేసి దౌర్జన్యం చేసి ఎమ్మెల్యే చింతమనేని మనుషులం.. నువ్వేమి చేయలేవంటూ హెచ్చరించారు. స్థానిక ఎస్సై మొదలు జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారుల వరకు అన్ని కార్యాలయాలకు పొలం యజమాని ఫిర్యాదు చేసినా పట్టించుకోని పరిస్థితి.

దెందులూరు మండలంలోని చల్లచింతలపూడిలో సర్వే నెంబర్ 12/2, 13/4లో విజయవాడకు చెందిన దాసరి బాబురావుకు 9.57 ఎకరాల భూమి ఉంది. 2005లో భూమిని కొనుగోలు చేసి లీజుకు ఇచ్చారు. అరటి, పామాయిల్ సాగు పొలంలో చేస్తున్నారు. ఈ క్రమంలో బాబురావు సమీప బంధువు, మండల టీడీపీ నాయకుడు పుసులూరి సత్యనారాయణ (బోస్), నాగబోయిన సత్యనారాయణ సెప్టెంబర్‌లో గ్రావెల్ తవ్వకాలకు భూ యజమాని నుంచి అగ్రిమెంట్ చేసుకుని భూమిని తీసుకున్నారు. ఎకరాకు రూ.13 లక్షలు చెల్లించేలా అది కూడా రెవెన్యూ ఎన్‌ఓసీ, మైనింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి అన్ని అనుమతులు తీసుకునే గ్రావెల్ తవ్వేలా అగ్రిమెంట్ చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పొలం యజమాని ఈ ఏడాది జనవరి 18న లీజుదారులను ప్రశ్నించి తవ్వకాలను అడ్డుకోవడంతో వివాదం చెలరేగింది. భూ యజమాని దాసరి బాబురావు, ఆయన భార్య నాగలక్ష్మిపై లీజుదారులు దౌర్జన్యం చేసి దాడి చేశారు. అనుమతులు తీసుకున్నా తరువాతనే తవ్వకాలు చేయాలని లేదంటే మైనింగ్ ఆపివేయాలని చెప్పి పొలంలో కూర్చొంటే దెందులూరు పోలీసుల సాయంతో యజమానులను పంపివేశారు. తాజాగా 3వ తేదిన మళ్లీ పొలం వద్దకు వెళితే యజమానిని లీజుదారులు అడ్డుకోవడం, ఎస్సై వచ్చి స్టేషన్‌కు వచ్చి మాట్లాడమని అక్కడ నుంచి పంపడం, ఆ మరుసటి రోజు బాబురావు తన వాహనం (ఏపీ16 సీయూ8505) వేసుకుని పొలం వద్దకు వెళితే లీజుదారులు కారు ఎత్తుకెళ్లడంతో పాటు మళ్లీ ఘర్షణలకు దిగారు. ఆ మరుసటి రోజు కొంతమంది మహిళలు భూ యజమానిని అడ్డుకుని కేసు పెడతామని భయభ్రాంతులకు గురి చేశారు.

ఎస్సై నుంచి కలెక్టరేట్ వరకు ఫిర్యాదులు చేసినా..

భూ యజమాని దాసరి బాబురావు దంపతులు దెందులూరు ఎస్సై, మైనింగ్ ఏడీకి, దెందులూరు తహసీల్దార్ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి, ఎస్పీ కార్యాలయానికి, డీఐజీ కార్యాలయానికి రాతపూర్వకంగా ఫిర్యాదులు చేసినా ఒక్క శాఖ కూడా పట్టించుకోలేదు. రెండురోజుల క్రితం ఏఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినా కనీసం స్పందించి తమకు న్యాయం చేయడం లేదని బాబురావు ఆవేదన వ్యక్తం చేశారు. తన పొలంలోకి తాను వెళితే అధికార పార్టీ పేరు చెప్పి దాడి చేసి దౌర్జన్యం చేస్తున్నారు. ఏ ఒక్క ప్రభుత్వ శాఖ కూడా పట్టించుకోవడం లేదని 7, 8 అడుగుల తవ్వాల్సిన గ్రావెల్ 15 అడుగుల మేర తవ్వేసి 2 వేల లారీల గ్రావెల్‌ను విక్రయించారని తెలిపారు.



భూ యజమాని దాసరి బాబురావు, నాగలక్ష్మి

న్యూస్‌రీల్

ఆత్మీయ కలయిక



పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నూజివీడు నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతాప్ అప్పారావు వివరించారు.


వేణుగోపాలరావుకు వైఎస్సార్ సీపీ జిల్లా పదవి

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కైకలూరు నియోజకవర్గానికి చెందిన ఎలుగుల వేణుగోపాలరావును పార్టీ ఏలూరు జిల్లా ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు బుధవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

కుక్కునూరులో గ్రామసభ

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్టు 41.15వ కాంటూర్ పరిధిలో ముంపునకు గురవుతున్న గ్రామాల నిర్వాసితుల సమస్యలను పరిష్కరించే దిశగా బుధవారం కుక్కునూరులో ఐటీడీఏ పీవో రాముల నాయక్ గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామ సభలో 41.15వ కాంటూర్ పరిధిలో ఆర్‌అండ్‌ఆర్ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ కాంటూరు పరిధికి సంబంధించి కటాఫ్ తేదీకి 18 సంవత్సరాలు నిండిన వారు, వాట్సప్ మెసేజ్‌లతో ఆర్‌అండ్‌ఆర్ జాబితా నుంచి పేర్లు తొలగించబడిన వాళ్లు, ఇతర కారణాలతో ఆర్‌అండ్‌ఆర్ రాని వాళ్లు ఎవరైనా ఉంటే ఆధార్ కార్డు, ఓటర్ ఐడి, రేషన్ కార్డ్, పదో తరగతి మార్కుల మెమో, ఇంటి రసీదులు, భూమి ఉంటే భూమి పత్రాలు, ప్రస్తుత కరెంట్ బిల్లులు తదితర ఆధారాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.రమేష్, ఎంపీడీవో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విజేతగా ఏలూరు ఐటీఐ విద్యార్థి



సిద్ధూకు పురస్కారం అందజేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గతేడాది మే నెలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన నైపుణ్య పోటీల్లో రాష్ట్ర విజేతగా ఏలూరు ఐటీఐ కళాశాల విద్యార్థి కాట్రు సిద్ధూ నిలిచాడని ఐటీఐ ప్రధానాధికారి పీ.రజిత తెలిపారు. ఎలక్ట్రికల్ ఇన్‌స్టలేషన్ విభాగంలో సిద్ధూ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడన్నారు. సిద్ధూకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జీ. గణేష్ కుమార్ గత జనవరి 30వ తేదీన ప్రశంసాపత్రం, రూ.30 వేల నగదు పురస్కారం అందజేశారని తెలిపారు. ఈ సందర్భంగా సిద్ధూను ప్రధానాధికారి రజిత, కళాశాల లెక్చరర్లు, విద్యార్థులు అభినందించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం ప్రయోగ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఒకేషనల్ విద్యార్థులకు తొలిరోజు 14 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు మొత్తం 1737 మందికి గాను 1461 మంది హాజరు కాగా 276 మంది గైర్హాజరయ్యారు. వీరిలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 1010 మందికి గాను 810 మంది హాజరు కాగా 200 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 727 మందికి గాను 651 మంది హాజరు కాగా 76 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే చంద్రశేఖర బాబు తెలిపారు.

12న మన్యం బంద్

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని 1/70 యాక్ట్‌పై మంత్రి అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ నెల 12వ తేదీన ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఏజెన్సీ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ బంద్‌ను జయప్రదం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు.

ముద్రగడకు సంఘీభావం



ముద్రగడకు సంఘీభావం తెలుపుతున్న నేతలు

కైకలూరు: వైఎస్సార్ సీపీ నాయకుడు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను పార్టీ నాయకులు ఆయన నివాసంలో బుధవారం కలిసి తమ సంఘీభావం తెలిపారు. ముద్రగడ నివాసంపై ఇటీవల దాడి జరిగిన విషయం విదితమే. మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపా శేషు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్‌తో పాటు మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ కైకలూరు మండల పార్టీ అధ్యక్షుడు శింగంశెట్టి రాము, నాయకులు పంజా రామారావు, కన్నా రమేష్ ముద్రగడకు సంఘీభావం తెలిపినవారిలో ఉన్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తు గడువు పెంపు

ఏలూరు టౌన్: గీత కులాలకు ప్రత్యేకంగా కేటాయించిన మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసేందుకు ఈనెల 8వ తేదీ వరకు గడువును పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఏలూరు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి ఆవులయ్య తెలిపారు. ఏలూరు న్యూ అశోక్‌నగర్ ప్రాంతంలోని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఈనెల 9న దరఖాస్తుల పరిశీలన, 10వ తేదీన ఏలూరు మినీబైపాస్ చలసాని గార్డెన్స్‌లో లాటరీ ద్వారా దుకాణాల ఎంపిక ప్రక్రియ చేపడతామని స్పష్టం చేశారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు కొలువులు

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో పలు సంస్థలు నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్స్‌లో 46 మంది ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం విద్యార్థులు పలు ఉద్యోగాలకు ఎంపికైనట్లు నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ తెలిపారు. ఇన్ఫోసిస్ సంస్థ నిర్వహించిన సెలక్షన్స్‌లో 25 మంది హాజరుకాగా అందులో 22 మంది ఎంపికయ్యారు. వీరిలో 20 మంది సీఎస్ఈ విద్యార్థులు కాగా, ఈసీఈ విద్యార్థులు ఇద్దరు ఉన్నారు. ఎంపికైన 22 మంది బాలికలే కావడం గమనార్హం. అలాగే హెటిరో డ్రగ్స్‌కు కెమికల్ ఇంజినీరింగ్‌కు చెందిన 18 మంది విద్యార్థులు జూనియర్ ఇంజినీర్లుగా ఎంపికయ్యారు. వీరిలో 10 మంది బాలురు, 8 మంది బాలికలు ఉన్నారు. శ్రీకర కన్‌స్ట్రక్షన్స్‌కు 6గురు సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థినులు ఎంపికయ్యారు. వీరిని డైరెక్టర్‌తో పాటు ఏఓ బీ లక్ష్మణరావు, డీన్ అకడమిక్ చిరంజీవి తదితరులు అభినందించారు.

విపత్తులను ఎదుర్కోవాలి

ఏలూరు (మెట్రో): జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా తీసుకోవాల్సిన చర్యలపై సమాచారాన్ని అందించాలని సీఐఐ బృందాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. బుధవారం జిల్లాకు విచ్చేసిన సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) బృంద సభ్యులు ముందుగా స్థానిక కలెక్టరేట్లో కలెక్టర్ వెట్రిసెల్విని కలిసి చర్చించారు.

అధికారులు పర్యవేక్షించాలి

గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి కేటాయించిన విధులను సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష చేశారు.

ఏసీబీకి చిక్కిన ఫుడ్ సేఫ్టీ అధికారి



ఏసీబీకి చిక్కిన ఏలూరు ఫుడ్ సేఫ్టీ అధికారి డి.కావ్యరెడ్డి, అటెండర్ పుల్లారావు

ఏలూరు టౌన్: నాణ్యత లేని గోలి సోడాలు తయారు చేస్తున్నారనే ఆరోపణలతో యజమాని నుంచి లంచం డిమాండ్ చేసిన ఏలూరు ఫుడ్‌సేఫ్టీ అధికారి, ఆఫీస్ అటెండర్‌ను ఏలూరు అవినీతి నిరోధక శాఖ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఏలూరు అభివృద్ధి నిరోధక శాఖ డీఎస్పీ వి.సుబ్బరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు మండలం కాట్లంపూడి గ్రామానికి చెందిన సాయి సుందర్ గోకుల్ అదే ప్రాంతంలో ఊప్స్ గోలీ సోడా కంపెనీ పేరుతో గోలీ సోడాను తయారు చేస్తున్నాడు. గోలి సోడా తయారీలో అధికంగా రసాయనాలు వినియోగిస్తున్నట్లు గుర్తించామనీ ఏలూరు ఫుడ్‌సేఫ్టీ అధికారి దొండపూడి కావ్యరెడ్డి, కార్యాలయ అటెండర్ పుల్లారావు గోకుల్‌కు ఫోన్ చేసి చెప్పారు. గోలీ సోడా విక్రయాలు సాఫీగా సాగాలంటే రూ.25 వేల లంచం డిమాండ్ చేశారు. ఎట్టకేలకు ఫుడ్‌సేఫ్టీ అధికారికి రూ.20 వేలు, సహాయకుడికి రూ.2 వేలు ఇచ్చేందుకు గోకుల్ సిద్ధపడ్డాడు. ఈ నేపథ్యంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు డబ్బులు కోసం వేధించటంతో గోకుల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో లంచం సొమ్మును ఫుడ్‌సేఫ్టీ అధికారి డి.వెంకట కావ్య రెడ్డికి, అటెండర్ పులపా పుల్లారావుకు గోకుల్ కార్యాలయంలో అందించాడు. అప్పటికే అవినీతి నిరోధక శాఖ అధికారులు వలపన్ని ఉండటంతో వెంటనే వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారి కావ్యరెడ్డి, అటెండర్ పుల్లారావు నుంచి రూ.22 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఫుడ్‌సేఫ్టీ అధికారి వినియోగిస్తున్న కారును తనిఖీ చేయగా లెక్కలు లేకుండా ఆరు కట్టలుగా కట్టి ఉన్న మరో రూ.87 వేల నగదును గుర్తించారు. మొత్తంగా రూ.లక్షా 9 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఫుడ్‌సేఫ్టీ అధికారి, అటెండర్ ఇంట్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఏలూరు ఏసీబీ డీఎస్పీ వీ.సుబ్బరాజు, సీఐలు ఎస్.బాలకృష్ణ, కే.శ్రీనివాస్, రాజమహేంద్రవరం ఏసీబీ అధికారి వాసుకృష్ణ ఉన్నారు.

క్లాప్ డ్రైవర్లపై కూటమి కత్తి

చిరుద్యోగులపై కక్ష

- క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) ఆటోలకు పొగ
- ఈనెల 1 నుంచి డ్రైవర్లను విధుల నుంచి తొలగింపు
- ఏలూరు కార్పొరేషన్‌లో 60 మందికి ఉద్వాసన
- మిగిలిన చోట్లా పక్కన పెట్టేందుకు కసరత్తు
- చెత్త తరలించేవారు లేక ఎక్కడి వ్యర్థాలు అక్కడే..
- రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి డ్రైవర్ల సన్నద్ధం



విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏలూరులో క్లాప్ ఆటో డ్రైవర్ల ప్రదర్శన

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం చిరుద్యోగులపైనా కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. చెత్త సేకరణ నిర్వహిస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఇప్పటికే ఏలూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 60 మంది క్లాప్ ఆటో డ్రైవర్లకు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఉద్వాసన పలికింది. మిగతా చోట్ల కూడా క్లాప్ ఆటో డ్రైవర్లను తొలగించేందుకు కసరత్తు చేస్తోంది. దీనిపై క్లాప్ ఆటో డ్రైవర్లు మండిపడుతున్నారు. రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సన్నద్ధమవుతున్నారు.

జిల్లాలో క్లాప్ ఆటోల వినియోగం ఇలా..

ఏలూరు కార్పొరేషన్‌లో 60 క్లాప్ ఆటోలు ఉండగా వీటి పరిధిలో మొత్తం 60 మంది ఆటో డ్రైవర్లు పనిచేస్తున్నారు. అలాగే జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీలో మొత్తం 9 ఈ–ఆటోలు ఉన్నాయి. వీటిలో ఐదు మాత్రమే వినియోగంలో ఉండగా వీటి పరిధిలో 9 మంది కాంట్రాక్ట్ డ్రైవర్లను వినియోగిస్తున్నారు. తాజాగా ఐదుగురే విధుల్లో ఉన్నట్లు చెబుతున్నారు. నూజివీడులో 6 ఈ–ఆటోలు పనిచేస్తున్నాయి. వీటి పరిధిలో ఆరుగురు కాంట్రాక్ట్ డ్రైవర్లు పనిచేస్తున్నారు.

మూడురోజులుగా ఆందోళన

ఏలూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 60 మంది క్లాప్ ఆటో డ్రైవర్లను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా విధుల నుంచి తొలగించారు. దీంతో ఈ నెల ఒకటో తేదీనుంచి వారు రోడ్డున పడాల్సి వచ్చింది. ఇలా అర్థాంతరంగా తమను విధుల నుంచి తొలగిస్తే తాము ఎలా బతకాలని క్లాప్ ఆటోల డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డ్రైవర్లు గత మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం క్లాప్ ఆటోల డ్రైవర్లు స్థానిక పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రదర్శనగా బయలుదేరి కరప్రంతెన, వసంత మహల్ సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్, జిల్లా పరిషత్ సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

రాజకీయ దురుద్దేశంతోనే తొలగింపు

జిల్లాలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లను రాజకీయ దురుద్దేశంతోనే విధుల నుంచి తొలగించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 5,300 క్లాప్ ఆటోలను ప్రవేశ పెట్టారు. వీటి నిర్వహణ బాధ్యతను నాలుగు ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించారు. దీనిలో భాగంగా జిల్లాలో స్వయంభు అనే ఏజెన్సీ క్లాప్ ఆటోలను నిర్వహిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వైఎస్సార్ సీపీ కాంట్రాక్టర్లే లబ్ధి పొందుతున్నారనే అక్కసుతోనే పాతవారిని తొలగించేందుకు క్లాప్ ఆటోల సేవలను నిలుపుదల చేశారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. తమ వారికి ఈ సేవలు కట్టబెట్టాలనే కుట్ర కోణం దీనిలో దాగి ఉందంటూ పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తక్షణం విధుల్లోకి తీసుకోవాలి



ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని క్లాప్ ఆటో డ్రైవర్లను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా క్లాప్ ఆటో డ్రైవర్లను విధుల నుంచి తొలగించడం దుర్మార్గం. తక్షణం విధుల్లోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలి. పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాల బకాయిలను చెల్లించాలి.

– బి.సోమయ్య, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏలూరు

ఉద్యోగ భద్రత కల్పించాలి



గత మూడున్నరేళ్ల నుంచి పనిచేస్తున్న తమను అకస్మాత్తుగా తొలగించడం అత్యంత దుర్మార్గం. మాకు ఉన్న ఒక్క ఆధారం పోతే మేము ఎలా బతకాలి. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి మాది. మాలాంటి చిరుద్యోగుల పట్ల కూటమి ప్రభుత్వం కనికరించాలి. తొలగించిన క్లాప్ ఆటో డ్రైవర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి. మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

– ఎం.పుష్పరాజ్, క్లాప్ ఆటో డ్రైవర్, ఏలూరు నగరపాలక సంస్థ


బకాయిలు చెల్లించక సేవలు నిలుపుదల

గతంలో వార్డు సచివాలయాల వారీగా చెత్త పన్ను సేకరించి వాటి నుంచి క్లాప్ ఆటోలు నిర్వహించే ఏజెన్సీలకు సొమ్ములను చెల్లించేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెత్త పన్నును రద్దుచేయడంతో ఆ భారం కార్పొరేషన్, మున్సిపాల్టీలపై పడింది. దీంతో ఏలూరు కార్పొరేషన్ పరిధిలో చెత్త వాహనాలు నిలిచిపోవడంతో ఎక్కడి చెత్త అక్కడ దర్శనమిస్తోంది. ఒక పక్క పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా చెత్త వాహనాలను, సిబ్బందిని పెంపుదల చేయాల్సిన ప్రభుత్వం ఉన్నవాటి సేవలను నిలుపుదల చేయడం ఎంత వరకు సమంజసం అంటూ క్లాప్ ఆటో డ్రైవర్లు ప్రశ్నిస్తున్నారు.



చెత్తను వాహనంలో వేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ (ఫైల్)

నమో నారసింహ



శోభనాచలుని రథోత్సవం, (ఇన్‌సెట్‌లో) కొలువుదీరిన ఉత్సవమూర్తులు

ఆగిరిపల్లి : నమో నారసింహ స్మరణలు మార్మోగాయి. ఆగిరిపల్లిలోని శోభనగిరిపై వేంచేసిన శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి గోదాదేవి అమ్మవారితో స్వామివారి తిరుకల్యాణం జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తులను రథంపై వేంచేపు చేశారు. బుధవారం ఉదయం స్వామివారికి మంత్రి కొలుసు పార్థసారథి పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. కల్యాణ మండపం, దమ్మన్న మండపం, వెంకటాచల మండపం, పొగడ చెట్ల మండపం మధ్య ఉన్న నాలుగు వీధుల మీదుగా రథోత్సవం సాగింది. కోలాట నృత్యాలు, బుట్టబొమ్మల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పొన్నం వెంకటలక్ష్మీ నారాయణ సోదరుల సహకారంతో రథాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అడ్డంకి శివ సత్యనారాయణ సోదరులు, వారి బృందం రథసారథులుగా వ్యవహరించారు. ఈఓ సాయి, తహసీల్దార్ ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై శుభశేఖర్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

తెలంగాణ మద్యం స్వాధీనం



చిన్నంపేటలో స్వాధీనం చేసుకున్న తెలంగాణ మద్యం

చాట్రాయి: అక్రమంగా విక్రయిస్తున్న తెలంగాణ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చిన్నంపేట గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతునే సమాచారం మేరకు దాడి చేసి గ్రామానికి చెందిన కోరుకొండ ప్రసాదు వద్ద 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. మండలంలోని పోతనపల్లి చిన తండాలో జరిపిన దాడుల్లో 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు వివరించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఫణికుమార్, ఎస్సై రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నంపై కేసు

టి.నరసాపురం: హత్యాయత్నం కేసులో బుధవారం ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చిన్నగుర్వాయిగూడానికి చెందిన యలమర్తి వెంకటేశ్వరరావు చెల్లెలు వాణి, తన భర్తతో కలిసి గత 15ఏళ్లగా హైదరాబాద్‌లో నివాసం ఉంటుంది. ఆ ప్రాంతానికి చెందిన నారాయణరెడ్డి అనే వ్యక్తికి, వాణికి మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీల్లో ఆతడిని వాణి మోసం చేసింది. దీంతో నారాయణరెడ్డి తండ్రి మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే వాణి తనను మోసం చేసిన ఘటనలో వాణి అన్న అయిన వెంకటేశ్వరరావు పాత్ర ఉందని భావించిన నారాయణరెడ్డి అతన్ని చంపేందుకు బుధవారం గుర్వాయిగూడెం వచ్చి కాపు కాసి వెంకటేశ్వరరావు ఇంటి నుంచి బయటకు వచ్చే క్రమంలో అదను చూసి అతనిపై కారం చల్లి, పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు యత్నించాడు. వెంకటేశ్వరరావు కేకలు వేయడంతో స్థానికులు నారాయణరెడ్డిని అడ్డుకున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గండ్ల గుదిబండ



నూజివీడు పెద్దచెరువుకు పడిన గండి



తాత్కాలికంగా గండికి రింగ్ బండ్ ఏర్పాటు చేసిన దృశ్యం

- పట్టణంలో ప్రమాదకరంగా పెద్ద చెరువు
- గండ్లు పడి ఐదు నెలల పూర్తయినా పట్టించుకోని వైనం

నూజివీడు: పట్టణంలోని పెద్ద చెరువుకు పడిన గండ్లు ఎప్పుడు పూడుస్తారో? అని పట్టణ ప్రజలు, ఆయకట్టు రైతులు ఎదురు చూస్తున్నారు. గతేడాది ఆగస్టు నెల చివరి వారంలో భారీ వర్షాలు కురవడంతో ఆగస్టు 31న పెద్ద చెరువుకు నాలుగు చోట్ల గండ్లు పడి చెరువులోని నీళ్లన్నీ బయటకుపోయాయి. భారీ వర్షాలకు చెరువుకు ఎగువన ఉన్న సిద్ధార్థనగర్ ప్రాంతాల్లోని కొండల నుంచి పెద్ద ఎత్తున వరద నీరు చేరి చెరువుకు నాలుగు చోట్ల గండ్లు పడ్డాయి. దీంతో వరదనీరు ముంచెత్తడంతో రోడ్లు సైతం ధ్వంసమయ్యాయి. గండ్లు పడి ఐదు నెలలు గడిచినా ఇంత వరకు వాటిని పూడ్చలేదు. గండ్ల వద్ద కేవలం తాత్కాలిక రింగ్‌బండ్ మాత్రమే వేసి వదిలేశారు. దీంతో ఈ గండ్లు పూడ్చటానికి ఎంత కాలం పడుతుంది? అని పట్టణ ప్రజలు ప్రజలు ఈ చెరువు ఒక్కసారి నిండితే రెండేళ్ల పాటు సాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు. ఒకవైపు సాగునీటిని అందించడంతో పాటు చెరువు నిండుగా ఉంటే పట్టణంలోని బావులు, బోర్లలో నీటి మట్టం పడిపోదని చెబుతున్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన చెరువు గండ్లను పూడ్చడానికి నెలల తరబడి జాప్యం చేయడంపై ఆయకట్టు రైతులు, పట్టణ ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

రింగ్‌బండ్‌లకు మాత్రమే పరిమితం

పెద్దచెరువుకు కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఒక గండి, పెట్రోలు బంకు, పాత గ్యాస్ గోడౌన్‌ల వద్ద మరో మూడు గండ్లు పడ్డాయి. ఈ గండ్లకు తాత్కాలికంగా రింగ్‌బండ్‌లను మాత్రమే వేసి ఉంచారు. అలాగే చెరువుకు చెందిన పెద్ద తూము, చిన్న తూము లు దెబ్బతిన్నాయి. వీటికి కూడా మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు. యనమదల వద్ద ఉన్న ఎత్తిపోతల పథకం ద్వారా సాగర్‌జలాలతో పెద్ద చెరువును నింపుకోవచ్చు. 200 ఎకరాల విస్తీర్ణం ఉన్న పెద్ద చెరువు కింద దాదాపు 350 ఎకరాల ఆయకట్టు ఉండగా, అందులో కొంత భాగం ప్రజలు ఇళ్లు నిర్మించుకోవడంతో పంటలు పండే ఆయకట్టు తగ్గింది. చెరువులో దక్షిణ, పడమర భాగాల్లో చాలా భాగం ఆక్రమణకు గురైంది. ఈ ఆక్రమణలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వచ్చే వర్షాకాలం నాటికైనా చెరువు గండ్లను పూడ్చించి చెరువును సిద్ధంగా ఉంచాలని కోరుతున్నారు.

గండ్లను త్వరితగతిన పూడ్చాలి



పెద్దచెరువుకు పడిన గండ్లను త్వరితగతిన పూడ్చాలి. గండ్లు పడి ఇప్పటికే ఐదు నెలలు గడిచిపోయాయి. మరో నాలుగు నెలలు గడిస్తే వర్షాకాలం వస్తుంది. కాబట్టి గండ్లను పూడ్చే పనులను త్వరితగతిన ప్రారంభించి పనులను పూర్తిచేయాలి. కట్టకు లోపలి వైపు రివిట్‌మెంట్ కట్టి బలోపేతం చేయాలి. ఆయకట్టు రైతులకు సాగునీరు ఎంతో అవసరం.

– నవుడు నాగమల్లేశ్వరరావు, 32వ వార్డు కౌన్సిలర్, నూజివీడు

రూ.80 లక్షలతో ప్రతిపాదనలు పంపాం

పెద్దచెరువుకు పడిన నాలుగు గండ్లను పూడ్చేందుకు గానూ రూ.80 లక్షలతో అంచనాలు రూపొందించి నిధుల మంజూరు కొరకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభించి పూర్తి చేస్తాం. గతంలో తాత్కాలికంగా రింగ్‌బండ్‌లు వేయించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– సలీం భాషా, ఇరిగేషన్ ఏఈ, నూజివీడు

మాజీ ఎమ్మెల్యే నాని సోదరుడిపై ఫిర్యాదు

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో తాను సబ్ కాంట్రాక్టర్‌గా పనులు చేయగా తనకు రావాల్సిన సొమ్ము ఇవ్వకుండా మోసం చేశారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ఎన్‌టీఆర్ జిల్లా నందిగామ మండలం జొన్నలగడ్డ గ్రామానికి చెందిన వేమూరి రామకృష్ణ పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశాడు. ఈ వివరాలు బుధవారం స్థానిక విలేకరులకు అందాయి. బాధితుడు ఫిర్యాదు మేరకు సబ్ కాంట్రాక్టర్‌గా అనేక చోట్ల కాంట్రాక్ట్ పనులు చేసే రామకృష్ణ ఏలూరు నియోజకవర్గంలోని వెంకటాపురం పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, వైఎస్సార్ కాలనీల్లో సీసీ రోడ్లు పనులు చేశాడు. ఏలూరు మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని సోదరుడు ఆళ్ల సురేష్ (బాబు) తనకు ఏలూరులో పలు కాంట్రాక్ట్ పనులు చేయాలని చెప్పగా బిల్లులు రావని చెప్పానని, పెట్టుబడి నేనే చూసుకుంటా అని సురేష్ చెప్పారని తెలిపారు. తొలుత తన ఖాతాల్లో వేర్వేరు వ్యక్తుల నుంచి రూ.70 లక్షలు జమ చేయగా పనులు ప్రారంభించి పూర్తి చేశామని తెలిపారు. అదే విధంగా పలు దఫాలుగా అభివృద్ధి పనులు సుమారు రూ.3 కోట్ల వరకూ ఖర్చు చేసి పూర్తి చేశామని తెలిపారు. తనకు సుమారు రూ.1.27కోట్ల 45వేల 423ల మేర సొమ్ములు చెల్లించారని, ఇంకా రూ.2.45కోట్ల మేర సొమ్ములు ఇవ్వాల్సి ఉందని బాధితుడు రామకృష్ణ తెలిపాడు. ఈ నేపథ్యంలో తన ఫిర్యాదును సీఐడీతో విచారించి తనకు న్యాయం చేయాలని రామకృష్ణ తెలిపారు.

గుబ్బల మంగమ్మ దర్శనానికి వెళ్లొస్తూ ప్రమాదం

మలుపులో కారు బోల్తా

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువై ఉన్న గుబ్బల మంగమ్మతల్లి దర్శనానికి వెళ్ళి తిరిగి వస్తున్న ఒక కారు కనకదుర్గమ్మ గుడి సమీపంలోని మలుపు లోయలో తిరగబడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడేనికి చెందిన ఆరుగురు భక్తులు బుధవారం కారులో గుబ్బల మంగమ్మతల్లిని దర్శించుకున్నారు. అనంతరం తిరిగి సాయంత్రం ఇంటికి బయల్దేరి వెళ్తున్న సమయంలో కామవరం సమీపంలో ఉన్న కనకదుర్గమ్మ గుడి మలుపులోయలో కారు దూసుకుపోయి తిరగబడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురిని వెనుక వాహనాదారులు సురక్షితంగా బయటకు రావడానికి సహకరించారు. సమాచారం అందుకున్న ఆలయ కమిటీ సభ్యులు అక్కడికి చేరుకుని లోయలో పడిన వాహనాన్ని ట్రాక్టర్ సహాయంతో బయటకు తీశారు. ఈ సంఘటనలో కారు తీవ్రంగా దెబ్బతింది.



కామవరం సమీపంలో బోల్తా కారులో ప్రయాణికులను బయటకు తీసుకువస్తున్న స్థానికులు

ఆక్వా రైతులు బీమా సౌకర్యం పొందాలి

కైకలూరు: ప్రకృతి వైపరీత్యాలు, వైరస్ వ్యాధులతో మత్స్య సంపదకు నష్టం వాటిల్లినప్పుడు ముందుగా చేయించుకున్న బీమా ఆక్వా రైతులను ఆదుకుంటుందని నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్‌ఎఫ్‌డీబీ) సీనియర్ ఎగ్జిక్యూటీవ్ సుష్మా చెప్పారు. ఎన్‌ఎఫ్‌డీబీ ఆధ్వర్యంలో బుధవారం కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో ప్రధాన మంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సాహ్ యోజన(పీఎం-ఎంకేఎస్‌ఎస్‌వై) కింద ఆక్వా కల్చర్ ఇన్సూరెన్సుపై ఆక్వా రైతులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సుష్మా మాట్లాడుతూ చెల్లించిన ప్రీమియంలో 40 శాతం కేంద్ర ప్రభుత్వం ఒకేసారి ప్రోత్సాహకాన్ని రైతు ఖాతాలో వేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, స్త్రీలకు మరో 10 శాతం అదనపు ప్రోత్సాహకం ఉంటుందన్నారు. ఒక హెక్టారుకు రూ.25,000, అదే విధంగా 4 హెక్టార్లకు రూ.లక్ష వరకు ప్రోత్సాహం పొందవచ్చాన్నారు. రాష్ట్రంలో 5 ఇన్సూరెన్సు కంపెనీలకు అవకాశం కల్పించారన్నారు. ఏలూరు జిల్లా మత్స్యశాఖ అధికారి సిహెచ్.నాగలింగచార్యులు మాట్లాడుతూ దేశస్థాయి ఉత్పత్తుల్లో ఏపీ నంబర్‌వన్ ఉండగా, అందులో ఏలూరు జిల్లా అగ్రస్థానంలో ఉందన్నారు. రాష్ట్ర చేపల రైతు సంఘ అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడు ముదునూరి సీతారామరాజు, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ నీలాద్రి, రైతులు చదలవాడ శేషగిరిరావు, సయ్యపురాజు గుర్రాజు, పెన్మత్స త్రినాథరాజు, భాష్యం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎన్‌ఎఫ్‌డీబీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ సుష్మ

చిల్డ్రన్ హోమ్‌కు చేరిన చిన్నారులు



చిన్నారులను ఏలూరు చిల్డ్రన్ హోమ్‌కు తరలిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: తల్లి, ఆమె ప్రియుడు దాడిలో గాయపడిన చిన్నారులు ప్రస్తుతం ఆరోగ్యంగానే ఉన్నారని ఐసీడీఎస్ పీడీ పి.శారద అన్నారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు ఉదయ్‌రాహుల్, రేణుకలను జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణితో కలిసి ఆమె పరామర్శించారు. చిన్నారులను జంగారెడ్డిగూడెం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసి ఏలూరు చిల్డ్రన్ హోమ్‌కు తరలించారు. సీడబ్ల్యూసీ ముందు చిన్నారులను ప్రవేశపెట్టి వారి నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్డీవో ఎంవీ రమణ, ఎస్సై షేక్ జబీర్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమల, ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూల, సూపర్‌వైజర్ కె.లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ లీల తదితరులు పాల్గొన్నారు. కాగా చిన్నారులను ఏలూరు చైల్డ్‌హోమ్‌కు తరలించే సమయంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది కన్నీటిపర్యంతమయ్యారు.

స్కూల్ బస్సు ఢీకొని బాలుడి మృతి

పెదపాడు: స్కూల్ బస్సు ఢీకొనడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పెదపాడు మండలంలోని పాతముప్పర్రు గ్రామానికి చెందిన వలదాసి దాసి ఏసుపాదం రెండో కుమారుడు శ్రీ దీక్షిత్(2) బయట ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టింది. చెవుల వెంబడి రక్తం కారుతున్న బాలుడుని బంధువులు స్థానికులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలుడి తండ్రి ఏసుపాదం ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ కృష్ణ కేసు నమోదు చేశారు.

3.5 టన్నుల రేషన్ బియ్యం సీజ్

నూజివీడు: మండలంలోని మిట్టగూడెం వద్ద మంగళవారం అర్ధరాత్రి మినీ వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 3.5 టన్నుల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఏలూరు డీఎస్‌ఓ సత్యనారాయణరాజు, నూజివీడు సివిల్ సప్లయిస్ డీటీ జి.వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి మిట్టగూడెం వద్ద అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో వ్యాన్‌ను తనిఖీ చేసే సమయంలో రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. ఆ బియ్యాన్ని అన్నవరం రైస్ మిల్లులో భద్రపరచి, వాహనాన్ని రూరల్ పోలీస్‌స్టేషన్లో అప్పగించారు. బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఎం.కృష్ణ శివదీప్, పెద్దిరెడ్డి రామచంద్రరావు, చప్పిడి వెంకట కృష్ణలపై 6(ఏ), 7(1) కేసులను నమోదు చేశారు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1) నిబంధనలతో చదువబడు ... (text as in the first e-auction notice)
ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు 1) ... 2) ... గమనిక -1 ... గమనిక -2 ... (as in the first e-auction notice)
తేది:05-02-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1) నిబంధనలతో చదువబడు ... (text as in the first e-auction notice)
ఇ-వేలం యొక్క నియమ నిబంధనలు 1) ... 2) ... గమనిక -1 ... గమనిక -2 ... (as in the first e-auction notice)
తేది:05-02-2025, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా